విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
శుక్రవారం 21, నవంబర్ 2025

వైసీపీ కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం భీమిలి 3వ వార్డులో వైసీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణ విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ పాల్గొన్నారు. భీమిలి 3వ వార్డులో గడప గడపకు తిరిగి కోటి సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రజల కనీస హక్కు అని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని ప్రజలకు దూరం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎల్లాజీ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వి.జగ్గారావు, జి.మధునాయుడు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'మహా' కౌన్సిల్

- 90 అంశాలతో అజెండా
- పలు అంశాలపై నిలదీసేందుకు విపక్షాలు సిద్ధం
- అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయొద్దంటూ కౌన్సిల్ తీర్మానం చేయాలని వామపక్షాలు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సరిగ్గా మూడు నెలలకు రెండు రోజులు ముందుగా మహా కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరగనుంది. 90 అంశాలతో అజెండాను సిద్ధం చేశారు. ఉద్యానవన విభాగంలో 40 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించేందుకు కౌన్సిల్లో పెట్టారు. దోమల సీజన్ అయిపోయినప్పటికీ దోమల నియంత్రణ పేరుతో మలేరియా విభాగంలో అధికారులు కొంతమంది యూనియన్ నేతల ప్రోద్బలంతో కీలకమైన పాలకవర్గ సభ్యుల సిఫార్సుల మేరకు మూడు నెలల పాటు మలేరియా విభాగంలో 431 మంది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు మలేరియా కార్మికులను కొనసాగించేందుకు అజెండాలో చేర్చారు. జోన్ 2లో 13వ వార్డు ముడసర్లోవ సమీపంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న శిక్షణ కేంద్రం అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులో మరమ్మతు పనుల కోసం కోటి తొంబై తొమ్మిది లక్షలు ఆమోదానికి పెట్టడం ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంది. కోట్లాది రూపాయలు పెట్టి నిర్మించినా అవి పనులకు ఉపయోగపడకపోవడంతో మళ్లీ నిరుపయోగంగా మారింది. మళ్లీ మరమ్మతుల పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంపై పలువురు ప్రజా పతినిధులు మండిపడుతున్నారు. పెదగంట్యాడలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టొద్దు అంటూ కౌన్సిల్లో తీర్మానం చేయాలని, ఆ అంశాన్ని అజెండాలో చేర్చాలని వామపక్షాల కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు. జీవీఎంసీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై వైసీపీతోపాటు ఇతర పక్షాల కార్పొరేటర్లు పాలకపక్షాన్ని నిలదీసేందుకు సన్నద్ధమయ్యారు. కూటమి పాలకవర్గంలో కొంతమంది కీలక నేతలు చేస్తున్న అవినీతి అక్రమాలపై నేడు కౌన్సిల్లో చర్చకు రానున్నాయి. కోడి వ్యర్థాల చెత్తతోపాటు, పలు నిధుల దుర్వినియోగం వంటి అంశాలపై జీరో అవర్‌లో చర్చించనున్నారు.

సచివాలయాల్లో మౌలిక వసతులు కరువు

- ఏడాదిగా మూలనపడిన కంప్యూటర్లు
- మధురవాడ పరిధిలోని నాలుగు సచివాలయాలకు ఒకటే కంప్యూటర్
- సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయలేక లబ్ధిదారుల పాట్లు
- స్టేషనరీ కొరతతో చేతులెత్తేసిన సిబ్బంది
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలను చేరువ చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థను అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వదిలేశారు. జీవీఎంసీ జోన్-2 మధురవాడ పరిధిలో ఉన్న 18 సచివాలయాలకు కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మరుగు దొడ్లు, మంచినీరు వంటివి కూడా అనేక సచివాలయాలకు లేకపోవడం విశేషం. ఏడాది కాలంగా కనీస అవసరాలైన కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు అందుబాటులో లేక సిబ్బంది, స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దాదాపు నాలుగు సచివాలయాలకు కలిపి ఒకే ఒక్క కంప్యూటర్ మాత్రమే పనిచేస్తోందని, దానికి కూడా ప్రింటర్ గాని, స్కానర్ గాని లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. దీంతో కుల, నివాస, ఆదాయ, రేషన్ కార్డు వంటి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించలేని నిస్సహాయ స్థితిలో సచివాలయ సిబ్బంది ఉన్నారు. దరఖాస్తుదారులు పదే పదే సచివాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. జీవీఎంసీ జోన్-2 మధురవాడ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోక పోవడంతో ఈ సమస్య ఏడాదిగా పరిష్కారానికి నోచుకోలేదని తెలుస్తుంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరోవైపు కంప్యూటర్లు, స్టేషనరీ సామాగ్రి కొరతను సాకుగా చూపుతూ కొందరు సచివాలయ సిబ్బంది గ్రూపులుగా కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొందరు సెక్రటరీలు డ్యూటీ ఎగ్గొట్టి "ఫీల్డ్‌లో ఉన్నామని" చెప్పి బాధ్యతల నుండి తప్పించుకుంటున్నట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. సచివాలయ కార్యదర్శుల అలసత్వం కారణంగా సేవలు మరింత ఆలస్యం అవుతున్నాయి. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు పెన్షన్ల పంపిణీ నుండి సామాజిక సర్వే వరకు అన్ని రకాల పనులు అప్పగించినప్పటికీ, విధులు నిర్వర్తించడానికి కావలసిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వ్యవస్థ నిర్వహణలో లోపానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, మధురవాడ జోన్ పరిధిలో ఉన్న సచివాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, స్టేషనరీ సామాగ్రితో పాటు సొంత భవనాలను వెంటనే కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేదంటే సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందే అవకాశం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాలాంధ్ర - వన్‌టౌన్: దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆర్పిఎం స్కూల్లో ఉన్నత పాఠశాల ఆవిర్భావ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు ఎన్నికల సమయంలో స్థానిక ప్రజల వినతి మేరకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పదవ తరగతి వరకు అదే పాఠశాలలో చదువుకునే విధంగా అవకాశాన్ని కల్పించారు. ఇప్పటివరకు ఎనిమిదవ తరగతి వరకు విద్యను అభ్యసించి అనంతరం ఉన్నత పాఠశాలకు వేరే స్కూల్లో చేరవలసిన ఆవశ్యకత ఉండేది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తాను మాట ఇచ్చారంటే కచ్చితంగా అమలు చేసి తీరుతానని, విద్యార్థులు ఇబ్బందులు దృష్ట్యా అదే పాఠశాలలో 10వ తరగతి చదువుకునే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ప్రభాకర్ మాస్టర్, ఎంఈఓ పైడప్ప నాయుడు, పుష్ప రాగిణి, స్కూల్ కమిటీ చైర్మన్ నాగమణి, స్టేట్ డైరెక్టర్ రూప, స్థానిక సీనియర్ నాయకులు గాయత్రి, మహేష్, కూటమి వార్డు పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ మంత్రివేముల శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ బిపిన్ పాల్గొన్నారు.

ఐఎఫ్ఆర్ -2026ను సమన్వయంతో నిర్వహిద్దాం

జిల్లా కలెక్టర్, నేవీ ఉన్నతాధికారులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 20వ తేదీ మధ్యలో జరగనున్న ఐఎఫ్ఆర్ (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) - 2026ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, నేవీ యంత్రాంగం సమన్వయంతో కలిసి పని చేద్దామని జిల్లా అధికారులు, నేవీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇరు వర్గాలు చేయాల్సిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, డీసీపీ మణికంఠ చందోలు, నేవీ ఉన్నతాధికారులు కమొడర్లు అమీ మాథ్యూ, రజ్నీష్ శర్మ, కెప్టెన్ ఎండీ అనూప్రజ్, కమాండర్లు వైకె కిశోర్, ప్రవీణ్ కుమార్, మనోజ్ కుమార్, కె.ఎన్. మొహంతే, లెఫ్టినెంట్ కమాండర్ వీరేందర్ కుమార్ తదితర అధికారులు ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించుకున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, రక్షణ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ, అధికార ప్రముఖులు రానున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై సుదీర్ఘంగా సమీక్షించుకున్నారు. సుమారు 100 మిత్ర దేశాల నుంచి అతిథులు విచ్చేస్తారని వారందరికీ రవాణా, వసతి సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 20వ తేదీ వరకు మిలాన్ విలేజ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 18న రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, 19న సిటీ పరేడ్‌తోపాటు, మిలాన్ ప్రారంభోత్సవం ఉంటుందని చెప్పారు. 19, 20వ తేదీల్లో మిలాన్ హార్బర్ ఫేజ్ ఉండగా, 21 నుంచి 25వ తేదీల వరకు సీ ఫేజ్ ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఇండియన్ నేవీ, పోలీసు, ఎన్.హెచ్.ఎ.ఐ., గెయిల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులతో పాటు, ఇన్చార్జి ఆర్డీవో సుధాసాగర్, ఎన్.హెచ్.ఎ.ఐ. పీడీ ప్రభత్ రంజన్, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ ఎన్నారు. అవంతి కళాశాల లైబ్రరీలో సుమారు 43 వేలు పుస్తకాలు అందుబాటులో వున్నాయని

పరిశోధన విస్తరణకు అలాగే పరిశోధనలో ప్రమాణాలను పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పాడతాయని డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థలు చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈశ్వరయ్యను సత్కరించిన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాలాంధ్ర - విశాఖ : విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన ఈశ్వరయ్యను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో విద్యార్థి సంఘం నాయకుడిగా ఈశ్వరయ్య పనిచేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్యను శాలువాతో ప్రణవ్ గోపాల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ, రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగంధర్, పి.డి.ఎస్.యు. రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ ఆదేశించారు. ఆయన గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను పరిశీలించారు. సుమారు రూ. 175 కోట్ల ఖర్చుతో 26.72 కిలోమీటర్ల పొడువున నిర్మించతలపెట్టిన 7 ప్రధాన బృహత్తర ప్రణాళికా రహదారులలో ప్రధానమైన.. 8 కిలోమీటర్ల అడివివరం - గండిగుండం, 2.20 కిలోమీటర్ల గంభీరం, 1.40 కిలోమీటర్ల గంభీరం - పరదేశి పాలెం, 3.00 కిలోమీటర్ల బోయపాలెం - కాపులుప్పాడ రహదారులను పరిశీలించారు. ప్రస్తుతం అడ్డంకులు, అవరోధాలు లేని ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన గడువు లోపు పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ రహదారులన్నీ అతి త్వరలోనే ప్రారంభించబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే ముఖ్యమైన రహదారులని, జాతీయ రహదారిపై ప్రయాణ ఒత్తిడి తగ్గించి త్వరగా విమానాశ్రయానికి చేరుకోవడంలో ఈ రహదారులన్నీ దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారిణి శిల్ప, పర్యవేక్షక ఇంజనీర్ మధుసూదనరావు, కార్యనిర్వహక ఇంజినీర్ రామరాజు, ఉప కార్యనిర్వహక ఇంజినీర్లు విశ్వనాథ్, రవిశంకర్, సహాయక ఇంజనీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ జీవీఎంసీ 5వ వార్డు పరిధిలో సుమారు12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. 5వవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో సాయిరాంకాలనీలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా సుమారు 12 కోట్ల వ్యయంతోఅభివృద్ధి పనులను చేపట్టామన్నారు .భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులు, వర్కులు మంచినీటి పైపులైన్లు కాలువలు, డ్రైన్లు నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం మారికవలస గ్రామంలో బ్రిడ్జ్ పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందిం చామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, వాండ్రాశి అప్పలరాజు, మన్యాల సోంబాబు, బోయి వెంకటరమణ, 5వ వార్డు అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ, ఈగల రవికుమార్, నగరాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి అనిత, జనసేన, బిజెపి నాయకులు దేవర శివ, ఎండ అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులు కావాలి: ఎంఈఓ

విశాలాంధ్ర - మల్కాపురం: ఆరోగ్య వంతమైన సమాజం మహిళలంతా విద్యావంతులైనప్పుడే సాధ్యపడుతుందని ములగాడ మండల విద్యాధికారి ఎల్.బి.వెంకట్రావు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాల యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలలో పుస్తకాలు చదవడం వల్ల సమస్యలను పరిష్కరించే శక్తి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకి పోలిరెడ్డి, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మల్కాపురం ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్ మిస్ట్రెస్ అరుణ కుమారి, ఉపాధ్యాయులు డి. కృష్ణారావు, పి.ఈశ్వరరావు, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో క్రీడలకు సిర్లపాలెం విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాల బాలికల ఖో ఖో సెలక్షన్స్‌లో భీమిలి డివిజన్ తరపున సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న రేగాని శృతిక, సారిక పవిత్ర, యర్ర హరణి, సిర్ల చైత్రహర్షిని మంచి ప్రతిభ కనబరిచారు. వీరు

రాష్ట్రస్థాయిలో ఆడనున్నారు. బాలురు విభాగంలో చందక మహేష్, బలికిల విభాగంలో బంటుంబల్లి సుజిన, కోట్ల దీక్షిత, రేగాని శృతిక ఎంపిక కాగా, రగ్బీ గేమ్‌కు బంటుబిల్లి రేవతి, వాలీబాల్ గేమ్‌కు పాసల శ్యామసుందర్, మారిక వంశీ ఎంపిక కాబడి త్వరలో రాష్ట్రస్థాయిలో విజయనగరం, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాలో పాల్గొనబోతున్నారని పాఠశాల పీడీ బుత్తల సత్యం తెలియజేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయరాలు శారద, పాఠశాల చైర్మన్ కోరాడ గౌరీ, గ్రామ సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ బోని అప్పలనాయుడు, మాజీ చైర్మన్ బుర్లే వెంకటరమణ, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

అకడమిక్ ఎక్సలెన్స్‌లో శంకర్ ఫౌండేషన్ బెంచ్‌మార్క్

విశాలాంధ్ర - పెందుర్తి: భారత ప్రభుత్వం గుర్తించిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నుండి అక్రిడిటేషన్ పొందడం ద్వారా శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ అండ్ ఇన్‌స్టిట్యూట్ విద్యా నైపుణ్యంలో ఒక మైలురాయి విజయాన్ని సాధించిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే.బంగార్రాజు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక అక్రిడిటేషన్ డిసెంబర్ 2025 నుండి డిసెంబర్ 2030 వరకు ఐదు సంవత్సరాల పాటు చెల్లుబాటులో ఉంటుందని, ఇది సంస్థ యొక్క విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందని ఆయన తెలిపారు. శంకర్ ఫౌండేషన్ 2011 నుండి డిఎన్ బి అక్రిడిటేషన్‌ను కలిగి ఉందని, ప్రతి ఐదు సంవత్సరాలకు పునరుద్ధరిస్తారని బంగార్రాజు తెలిపారు. ఈ అక్రిడిటేషన్ శంకర్ ఫౌండేషన్‌లో ప్రతి సంవత్సరం ఆప్తాల్మాలజీలో ఆరు డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ సీట్లలో ప్రవేశాలు, డిఎన్ బి అర్హతలు, ఎంఎస్ డిగ్రీకి సమానం, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య అభ్యర్థులకు జాతీయంగా గుర్తింపు పొందిన స్పెషలైజేషన్ అర్హతలున్నాయని వెల్లడించారు. శంకర్ ఫౌండేషన్‌ను అధునాతన వైద్య విద్య కోసం ఈ ప్రాంతంలోని ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా నిలిచిందని, నీట్ పీజీలో అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు శంకర్ ఫౌండేషన్‌లో డిఎన్ బి ఆప్తాల్మాలజీని అభ్యసించవచ్చునన్నారు. ఈ విజయం పట్ల మేనేజింగ్ ట్రస్టీ కె కృష్ణ కుమార్, జీఎం కె.రాధాకృష్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.కృష్ణ ప్రసాద్ వైద్యులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

22న బెహరా వెంకట సుబ్బారావు పుస్తక పరిచయ సభ

విశాలాంధ్ర - విశాఖ : ప్రముఖ రచయిత బెహరా వెంకట సుబ్బారావు సర్వ లభ్య రచనల సంపుటం (73 కథలు - 2 నవలలు) పుస్తక పరిచయ సభను ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు వర్షం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా లీడర్ దినపత్రిక సంపాదకులు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి హాజరవుతారని తెలిపారు. నగరంలోని సాహితీ ప్రముఖులు డాక్టర్ డి.వి.సూర్యారావు, కథా రచయిత, అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు, కథారంజని అంతర్జాల పత్రిక సంపాదకులు జయంతి ప్రకాష్ శర్మ పుస్తకాన్ని విశ్లేషనాత్మకంగా పరిచయంచేస్తారని చెప్పారు. అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

కీర్తిశేషులు బెహరా వెంకట సుబ్బారావు కుమారులు బెహరా సత్యనారాయణ మూర్తి ఆహ్వానం పలికే ఈ సభకు కె. సన్యాసిరాజు వందన సమర్పణ చేస్తారు. ఈ సభకు నగరంలోని కవులు, కథకులు, నవలా రచయితలు సాహిత్యాభిలాషులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

కలకలం రేపిన గో మాంసం రవాణా

- శ్రీమిత్రా కోల్డ్ స్టోరేజ్‌లో ఆవు మాంసం
- 189 టన్నుల్లో 87టన్నులు గోమాంసమేనని ధృవీకరణ
- ప్రత్యేక దర్యాప్తు బృందాల ఏర్పాటు

విశాలాంధ్ర - కొమ్మాది: గుట్టు చప్పుడు కాకుండా గత కొన్నేళ్లుగా రవాణా చేస్తున్న గోమాంసంపై ప్రస్తుతం విశాఖ జిల్లాలో తీవ్ర కలకలం రేగుతుంది. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది. శొంఠ్యాం సమీపంలోని దిబ్బడిపాలెం వద్ద ఉన్న శ్రీమిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్ నుండి ఎగుమతికి సిద్ధంగా ఉన్న మాంసం కంటైనర్‌లో ఆవు మాంసం కలిసి ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడి కావడం విశాఖపట్నంలో సంచలనం సృష్టించింది. తెలంగాణకు చెందిన 'మిష్ ఓవర్సీస్' అనే సంస్థ ఈ మాంసాన్ని ఎగుమతి చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు మొత్తం189 టన్నుల మాంసం నుంచి ఆరు శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపగా, అందులో 87టన్నుల మాంసం ఆవు మాంసమేనని ధృవీకరించబడింది. ఈ వ్యవహారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్ళింది. భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. దీనిపై విచారణను వేగవంతం చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మధురవాడ నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని పీఎం.పాలెం, భీమిలి, పద్మనాభం, ఆనందపురం పోలీస్ స్టేషన్లలో ఎస్.ఐ. స్థాయి అధికారులతో ఈ సంఘటనపై దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విచారణలో గోప్యత పాటించడంపై హిందూ ధర్మ పరిషత్తు, జన జాగరణ సమితి వంటి సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎవరిని కాపాడడానికి విచారణలో గోప్యత పాటిస్తున్నారు అని ఈ సంస్థలు ఘాటుగా ప్రశ్నించాయి. ఈమొత్తం వ్యవహారంపై మరింత లోతైన దర్యాప్తు జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలని హిందుత్వ వాదులు ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారు. అసలు గోమాంసం ఎన్నాళ్లు నుంచి ఇలా రవాణా చేస్తున్నారని దర్యాప్తు బృందం అధికారులు ఆరా తీస్తున్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి సన్నిధిలో వైభవంగా ఆర్జిత సేవలు జరిగాయి. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారికి 108 బంగారు సంపెంగలతో అత్యంత వైభవంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం ఆర్జిత సేవలు జరిగాయి. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయ దాతలకు వేద ఆశీర్వాదం, శేష వస్త్రాలు అందజేసి, పెరుమాళ్ అంతరాలయ దర్శనాలు అధికారులు కల్పించారు. అదేవిదంగా గురువారం అమావాస్య కావటంతో భైరవ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



పోలీసులకు ట్రాఫిక్ బారికేడ్లను అందించిన మ్యాక్సీవిజన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి (విజయవాడ) నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా తయారు చేసిన ట్రాఫిక్ బారికేడ్లను విజయవాడ సిటీ ట్రాఫిక్ పోలీసులకు మ్యాక్సీవిజన్ ఆసుపత్రి బృందం అందజేసింది. ఈ బారికేడ్లు ఎక్కువ రద్దీ ఉన్న చోట్ల ట్రాఫిక్‌ను నియంత్రించడానికి, అలాగే రద్దీ సమయాల్లో రోడ్డు భద్రతను పెంచడానికి పోలీసులకు ఉపయోగపడతాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర భద్రత, క్రమశిక్షణ కోసం కష్టపడుతున్న పోలీసులకు తమ సహాయం అందించడానికి ఈ పని చేశామని చెప్పారు. ఈ చొరవ ద్వారా, మ్యాక్సీవిజన్ ప్రజారోగ్యంపై తమ నిబద్ధతను మరోసారి నొక్కి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ఎస్.ఆర్.వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ వై.రవి కుమార్ హాజరయ్యారు.

సమష్టి కృషితోనే భాగస్వామ్య సదస్సు విజయవంతం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉన్నతాధికారులు, కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది తదితరుల సమష్టి కృషితోనే విశాఖ వేదికగా ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని, దీనిలో అందరి శ్రమ దాగి ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. సీఐఐ సమ్మిట్ విజయవంతమైన నేపథ్యంలో బుధవారం రాత్రి వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో అభినందన సభ నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణలో బాధ్యతలు నిర్వర్తించిన ప్రతి ఒక్క విభాగం కృషిని, అధికారుల శ్రమను కొనియాడుతూ కలెక్టర్ ప్రసంగించారు. పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, జాయింట్ కలెక్టర్ తనవెంట ఉన్నారని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించటంలో వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. అటు అధికార యంత్రాంగం, ఇటు సీఐఐ ప్రతినిధులు సమన్వయం వహించారని, పరస్పరం సహకారం అందించారన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌లు మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సరైన మార్గదర్శకత్వంలో అందరినీ నడిపించారని గుర్తు చేశారు. అనంతరం భాగస్వామ్య సదస్సు నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, ఇతర ఉద్యోగులకు కలెక్టర్, సీపీ, జేసీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

అదర్శ కమ్యూనిస్టు కార్మికోద్యమ నిర్మాత కామ్రేడ్ కోలా గురుమూర్తి

జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయుసి) అధ్యక్షులు పదాల రమణ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఉదయం జరిగిన కామ్రేడ్ కోలా గురుమూర్తి 34వ వర్ధంతి సభలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు పదాల రమణ పాల్గొని కోలా గురుమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పదాల రమణ మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకుడిగా, సీపీఐ పార్టీ తొలి తరం నాయకులలో ఒకరని కార్మిక హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు నడిపిన నిబద్ధత కలిగిన గొప్ప కార్మిక నాయకుడన్నారు. ఆర్మీలో ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కార్మిక నాయకుడిగా ఉమ్మడి రాష్ట్రంలో విశాఖ జిల్లా వేదికగా చేసుకొని మున్సిపల్, ఆర్టీసీ, మెడికల్ ఉద్యోగుల ఐక్యంగా కదిలించి సంఘాలను ఏర్పాటు చేసి చట్టబద్ధంగా అనేక హక్కులని పోరాడి సాధించిన గొప్ప కార్మికు ఉద్యమ నిర్మాత అన్నారు. ఏఐటీయూసీ నాయకుడిగా, సిపిఐ జిల్లా కార్యదర్శిగా, వీఎంసీలో సిపిఐ కార్పొరేటర్‌గా గెలిచి వార్డ్‌లో ప్రజా సమస్యలే కాకుండా విశాఖ నగర అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి సలహాలు సూచనలే కాకుండా ప్రజా పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. జీవీఎంసీలో రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు సాధన కోసం, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు రెగ్యులర్ రిజిస్ట్రేషన్, కార్మికులు వారి కుటుంబాలకు వైద్య సౌకర్యం కోసం ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు సాగించవలసినటువంటి అవసరం ఉందని, కామ్రేడ్ కోలా గురుమూర్తి ఆశయాలు సాధనకు అంకితమై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోలా వాణి, ప్రియదర్శిని, కే.సత్యనారాయణ, సబ్బి రమేష్, లింగాల వెంకటేష్ , లీలా ప్రసాద్ బోనీ అంజి బాబు, అర్జున్, శంకర్, బంగారియ్య, కరుణాకర్, కోలా గురుమూర్తి (జూనియర్) మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.అప్పారావు, రిటైర్మెంట్ ఉద్యోగుల సంఘం నాయకులు రాధాకృష్ణారెడ్డి, అప్పాజీ, ప్రసాద్, సూర్యనారాయణ, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

రేకుల షెడ్డు తొలగించడంతో బాధితులు ఆందోళన

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో తొలగించడంతో జెసిబిని దళితులు అడ్డగించారు. భీమిలి జీవీఎంసీ కృష్ణ కోలనీలో నీలపు అప్పలరాజు అనే వ్యక్తి 60 గజాల స్థలాన్ని వేరే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో అందులో రేకుల షెడ్డును నిర్మించుకుంటున్నాడు.ఆ స్థలము ఐసిడిఎస్‌కు సంబంధించిన స్థలమని శ్రీదేవి అనే అధికారి రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు.దీంతో రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో జెసిబితో వాటిని తొలగిస్తున్న క్రమంలో అప్పలరాజు కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దళితుడను అవ్వడంతోనే కక్ష్య పూర్వకంగా చర్యలు తీసుకుంటున్నారని అప్పలరాజు ఆరోపించారు. చుట్టుపక్కల చాలామంది అక్రమ నిర్మాణాలు చేసిన వాటిని ఎందుకు తొలగించ లేదని అధికారులను ప్రశ్నించాడు. ఉన్నతాధికారులకు కలిసి తమ గోడు విన్నవించేందుకు రెండు రోజులు గడువు ఇవ్వాలని అధికారులకు కోరిన బలవంతంగా ఖాళీ చేయిస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు ఉన్నత అధికారులతో సంప్రదింపులు జరిపిన ఫలితం లేకపోవడంతో రేకుల షెడ్డును జెసిపితో తొలగించారు.

తహశీల్దార్‌కు ఘనసన్మానం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం తహసీల్దార్ కాకర ఆనందరావును విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ చేతుల మీదగా ఘనంగా సత్కరించారు. ఈనెల జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిల సదస్సులో తహసిల్దార్ తనదైన శైలిలో ఎంతో సమన్వయంతో ఈ సమ్మిట్ లో అత్యుత్తమ సేవలను అందించారు. ఇందుకుగాను పలువురు సదస్సుకు హాజరైన వ్యక్తుల నుంచి, ప్రతినిధుల నుంచి తహసీల్దార్ ఆనందరావుకు మంచి ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆనందరావును అత్యుత్తమ సేవల అందించినందుకు గుర్తింపుగా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రెవెన్యూ సిబ్బంది కుటుంబ సభ్యులు తహసిల్దార్ ఆనందరావుకు శుభాభినందనలు తెలియజేశారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర పద్మనాభం: శ్రీ అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం అనంతరం గురువారం దేవాదాయ శాఖ అధికారులు స్థానిక నేతలు ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించారు. హుండీల ద్వారా 4,11,660 రూపాయలు, దర్శనం టికెట్స్ మరియు విరాళాలు ద్వారా 2,37,360 రూపాయలు మొత్తం 6,49,020 రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు కాళ్ళ నగేష్ కుమార్, ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టి.టి పోటీలలో గీతం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్(టి.టి) పోటీలలో గీతం విద్యార్థులు విశాఖ జట్టు తరపున పాల్గొని ప్రతిభను చాటారు. ఈ పోటీలలో పురుషులు సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన విశాఖ జట్టులో గీతం విద్యార్థులు కుశాల్ దాస్, సూర్య, రోహిత్ హల్‌దర్ ప్రతిభను కనబరిచి పతకాలు అందుకున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో పి.హసని కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, శాప్ డైరక్టర్ ఎండి రమేష్‌కుమార్, జివిఎమ్‌సి స్పోర్ట్స్ డైరక్టర్ ఇ.అప్పలరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్‌కార్తిక్, ఏపి టేబుల్ టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.వై.శర్మ, వివిధ జిల్లా క్రిడాకారులు, కోచ్‌లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

డిజిఅరివు కార్యక్రమాన్ని ప్రారంభించిన సామ్‌సంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్ సంగ్, యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా (యుఎన్ జీసీఎన్ఐ) భాగస్వామ్యంతో, తమిళ నాడులో డిజిటల్, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం (స్టెమ్) విద్యను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టు కున్న విద్యా కార్యక్రమం 'డిజిఅరివు మెంటల్ స్టూడెంట్స్ త్రూ టెక్'ను ఈరోజు ప్రారంభించింది. ఈ చొరవ ద్వారా, సామ్‌సంగ్ తమిళనాడులోని కాంచీపురం, రాణిపేట జిల్లాల్లోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ శాల మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేస్తుంది, స్టెమ్, డిజిటల్ అభ్యాసాన్ని ప్రారంభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించే పాఠశాలలతో యూఎన్ జీసీఎన్ఐ చేసిన పరిశోధన, శ్రీపెరంబుదూర్ తయారీ కర్మాగారంలోని సామ్‌సంగ్ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని కమ్యూనిటీ సభ్యుల ఇన్‌పుట్‌ల ఆధారంగా ఈ కార్యక్రమం రూపొందించబడింది.

రైడ్ ఆన్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌ను ఆవిష్కరించిన ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్

విశాలాంధ్ర -విశాఖపట్నం : భారతదేశంలో మూడో తరం రైడ్ ఆన్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌ల' ఆవిష్కరణ భారతదేశంలో వ్యవసాయ రంగ పరికరాలు మరియు నిర్మాణ యంత్రాల తయారీలో అగ్రస్థానంలో ఉన్న, ప్రముఖ ఇంజినీరింగ్ సమూహాలలో ఒకటైన ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్ సంస్థ, రైతుల కోసం ఒక సరికొత్త ఆవిష్కరణతో మన ముందుకు వచ్చేసింది. ఇందులో భాగంగా, సంస్థ తమ శక్తివంతమైన కుబోటా బ్రాండ్ కింద మూడవ తరం రైడ్ ఆన్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌లను (కేఏ 6 మరియు కేఏ 8) భారతీయ వ్యవసాయ మార్కెట్‌కు అధికారికంగా పరిచయం చేసింది. ఈ కేఏ 6 మరియు కేఏ 8 ట్రాన్స్‌ప్లాంటర్‌లు ప్రత్యేకంగా ఇంధనాన్ని ఆదా చేసే (పొదుపు చేసే) శక్తివంతమైన ఇంజిన్‌ల ద్వారా పని చేస్తాయని ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్ సంస్థ యొక్క చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ భరత్ మదన్ అన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో బహుమతి ప్రధానం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా పెదగంట్యాడ గ్రంథాలయంలో ముగింపు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమ సభకు సాహిత్య సుధా వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి 75 వ వార్డు కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీబాయి, మరియు నడుపూరు ,హై స్కూల్ హెచ్. ఎం. ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో డ్రాయింగ్ , మ్యూజికల్ చైర్స్ ,పేపర్ క్రాఫ్ట్, రంగోలి, వ్యాసరచన, పోటీలు లో విజేతలకు బహుమతులు అతిధుల చేతుల మీద ప్రధానం చేశారు. గ్రంథాలయ అధికారి రమణ వందన సమర్పణతో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు సురేష్ ,మహేష్ ,నరేష్, శేఖర్ ,నవ్య ,అంజలి, గీతిక, తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఫార్మర్ సపోర్ట్ పార్టనర్షిప్ (ఎఫ్ఎస్‌పీ) కార్యాచరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: కాఫీ రైతులకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఫార్మర్ సపోర్ట్ పార్టనర్షిప్ (ఎఫ్ ఎస్ పీ) కార్యాచరణ ఉంటుందని టాటా స్టార్‌బక్స్ ప్రాంతీయ మార్కెటింగ్ అభివృద్ధి అధికారి సుశాంత్ దాష్ తెలిపారు. ఎఫ్ ఎస్ పీ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్‌బక్స్ కాఫీ కంపెనీ, టాటా స్టార్‌బక్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో ప్రారంభించబడిన ఫార్మర్ సపోర్ట్ పార్టనర్షిప్ (ఎఫ్ ఎస్ పీ) 2030 నాటికి 10 వేల మంది భారతీయ కాఫీ రైతులకు సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఎఫ్ ఎస్ పీ స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులను ఓపెన్ సోర్స్ వ్యవసాయ శాస్త్రం ద్వారా ప్రపంచ వ్యవసాయ ఉత్తమ పద్ధతులకు అనుసంధానిస్తుందన్నారు. రైతుల భాగస్వామ్యంతో సాంకేతిక "మోడల్ ఫామ్‌లను" ఎఫ్ఎస్‌పీ ఏర్పాటు చేయనుందని, ప్రపంచ అభ్యాసాలను మిళితం చేయటం, కాఫీ వ్యవసాయ శాస్త్రంలో ఉత్తమ పద్ధతులను పొందుపరచటం, స్థిరమైన పరిష్కారాలను పరీక్షించడం చేయనుందన్నారు. రాబోయే 5 సంవత్సరాలలో కాఫీ ఉత్పాదకతను మెరుగుపరచడం , వ్యవసాయ లాభదాయకతను పెంచడం, వాతావరణ స్థిరత్వంను నిర్మించడం వంటి కీలకమైన స్టార్‌బక్స్ నిబద్ధతలకు అనుగుణంగా ఎఫ్ ఎస్ పీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తుందన్నారు.

'డ్రింక్ ఫ్రం ట్యాప్' ప్రాజెక్ట్ అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రింక్ ఫ్రం ట్యాప్' ప్రాజెక్ట్ అమలు పై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను హోటల్ గ్రీన్‌పార్క్, విశాఖపట్నంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం అమృత్ 2.0 కార్యక్రమం కింద 24/7 సురక్షిత తాగునీటి సరఫరా వ్యవస్థలను అమలు చేయడంలో రాష్ట్ర పట్టణ సంస్థల అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం, అలాగే "డ్రింక్ ఫ్రం ట్యాప్" లక్ష్యాల వైపు విశాఖపట్నం చేస్తున్న పురోగతిని పంచుకోవడం జరిగింది. డా. రామకాంత్ వర్క్‌షాప్ ఆవశ్యకతను వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రీ-మాన్సూన్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ అర్బన్ ఫ్లడింగ్ మిటిగేషన్‌పై సలహా పుస్తకాన్ని విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ డ్రింక్ ఫ్రం ట్యాప్ లక్ష్యాలు, ప్రాముఖ్యత మరియు పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థల బలోపేతం గురించి విశదీకరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డా. అశోక్ నటరాజన్, డా. ఎం. స్నేహలత, చిన్మయ్ త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరించండి



విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ డివిజన్లో ఎప్పటినుండో పలు సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని వాటిని పరిష్కరించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాస్‌కి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు వినతిపత్రం ద్వారా కోరారు. గురువారం ఉదయం విశాఖపట్నంలో మేయర్ పీలా శ్రీనివాస్‌ను ఆయన చాంబర్‌లో కలసి గంటా నూకరాజు వినతిపత్రం ఇచ్చారు. రెల్లివీధిలో సామాజిక మరుగుదొడ్లు లేక స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరికి చిన్న చిన్న ఇళ్ళు ఉండటం వలన వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొనుటకు వీలులేకుండా పోయిందని అన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిదంగా రెల్లివీధి స్మశాన వాటికలో కనీస మౌలిక వసతులు లేవని అన్నారు. పార్థివ దేహాన్ని తీసుకొని వెళ్ళుటకు త్రోవ లేదని అన్నారు. అక్కడకు వెళ్లే వారికి కనీసం మంచినీరు కూడా లేదని అన్నారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

పాఠశాలకు రోటరీ క్లబ్ మైక్రోస్కోప్ వితరణ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు రోటరీ క్లబ్ ముందుకు వచ్చింది. పాఠశాల సైన్స్ ల్యాబ్ కోసం రూ.19,000 విలువైన అత్యాధునిక మోడల్ మైక్రోస్కోప్‌ను రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, గవర్నర్ బాబ్జాన్ ఆల్తిఫ్, వారి సతీమణి ఆల్తిఫ్‌తో కలిసి గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్ కుమార్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఇజ్రాయిల్ రోమర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మైక్రోస్కోప్‌ను సైన్స్ ఉపాధ్యాయులు మారుతి గణేష్ మరియు సూర్యనారాయణకి అధికారికంగా అప్పగించారు. రోటరీ క్లబ్ మా పాఠశాలను దత్తత చేసుకుని ఇప్పటి వరకు పలు సౌకర్యాలు కల్పించిందని, ఈ సహాయం పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ తెలిపారు. రోటరీ ప్రెసిడెంట్, గవర్నర్ తదితర సభ్యులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి బి.వి.ఎస్.అప్పారావు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిధులుగా ఎం.ఇ.ఓ-2 కె. గంగరాజు, సర్పంచ్ చందక లక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు, యువత గ్రంథాలయాలను తరచుగా సందర్శించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. 2025 సంవత్సరానికి బెస్ట్ రీడర్ అవార్డును ఎల్. ఉమా శంకర్‌కు ప్రదానం చేశారు. అదే విధంగా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగటి రాము, శ్రీనాధు నారాయణరావు, కొట్యాడ రెడ్డిబాబు, కొట్యాడ సత్యమూర్తి, దొంతల ఆదినారాయణ, పి. త్రినాధరావు (హైస్కూల్ టీచర్), పి. పైడిరాజు (ఎంపీపీపీ స్కూల్ టీచర్) తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి బి.వి.ఎస్.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయం

వార్డు, బూత్, అనుబంధ కమిటీల అంశంపై వైసీపీ శ్రేణులతో వాసుపల్లి భేటీ

విశాలాంధ్ర - వన్‌టౌన్: వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయం అని వైసీపీ విశాఖ దక్షిణ నియోజక వర్గం సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. 29, 30, 33వ వార్డులలో పర్యటించి ఆయా వార్డుల అధ్యక్షులతో వాసుపల్లి సమావేశం అయ్యారు. వార్డు, బూత్ అనుబంధ కమిటీలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని మండి పడ్డారు. సూపర్ సిక్స్ ఎప్పుడు కొడతారని ప్రజలు ఆగ్రహంగా వున్నారని ఆయన గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వోటుతో కూటమి పార్టీలకు చెంప దెబ్బ కొట్టడం ఖాయం అని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, 30వ వార్డు దశమంతల మాణిక్యాలరావు, 33వ వార్డు ముత్తా బత్తుల రమేష్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్,స్టేట్ యూత్ సెక్రటరీ కనకళ ఈశ్వర్, జిల్లా సెక్రటరీ గంగళ రాంరాజు, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, జిల్లా నాయకులు ఆయా వార్డుల సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధార్థ డాన్స్ ఫెస్టివల్‌కు భీమిలి బాలిక

విశాలాంధ్ర - భీమిలి: విజయవాడ సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జరిగే బహుభాషా జానపద నృత్యోత్సవానికి భీమిలిపట్నం మండలం నుంచి బీజపు గీతిక హాజరవుతోంది. అగ్రహారం తాలూకా కొత్తవలస గ్రామానికి చెందిన గీతిక భీమిలిపట్నం పండిట్ జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతోంది. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ గారి పేట బ్రాంచ్‌లో అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్ వద్ద శిక్షణ పొందుతోంది. విశాఖ జిల్లా నుంచి హాజరయ్యే కళాబృందంలో సభ్యురాలుగా వేప చెట్టుకు ఉయ్యాలా తెలంగాణ జానపద నృత్యం, గడ్డిమోపు నెత్తిన పెట్టి అనే ఆంధ్ర జానపదం నృత్యాలను ప్రదర్శిస్తుంది. ఈ బృందానికి కో ఆర్డినేటర్ గా అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అంతర్జాతీయ నృత్య కళాకారిని రఘుపాత్రుని హర్షిత టీనా వ్యవహరిస్తున్నారు.

ఎల్వి పాలెంలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం లోడగల వాని పాలెం గ్రామంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సంగివలస అనిల్ నీరుకొండ డెంటల్ సైన్సెస్ వైద్య బృందం దంత పరీక్షలు నిర్వహించింది. శిబిరంలో మొత్తం 100 మందికి దంత పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ వైద్య బృందం ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, వైద్యులు డాక్టర్స్ శివ, స్వాతి, సుకన్య, ఎన్‌వి సాయికుమార్, తరుణ్, వరుణ్ , భావన, లికిత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - మల్కాపురం: గ్రంథాలయాలని విద్యార్థులందరు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు అన్నారు. గురువారం గాంధీగ్రామ్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షిప్ యార్డ్ గుర్తింపు యూనియన్ కార్యదర్శి మూర్తి, పశు వుల ఆసుపత్రి వైద్యధికారి డాక్టర్ సునీల్ కుమార్, వార్డు నాయకులు కమల్ నాయుడు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు పారిశుద్ధ్య సిబ్బందికి జీవీఎంసీ మంజూరు చేసిన దుస్తులను పంపిణి చేశారు. గురువారం వార్డ్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు, టౌన్ ప్లానింగ్ చైర్మన్ గులిగిందాల లావణ్య, పారిశుద్ధ ఇన్స్పెక్టర్ రవి, వార్డ్ అధ్యక్షులు గులిగిందాల కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఛైర్‌పర్సన్‌కు అంతర్జాతీయ అవార్డు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జాతీయ విద్యా సమాజానికీ గర్వకారణంగా, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఛైర్‌పర్సన్ మల్ల రామునాయుడుకి నీసా(నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్)నుంచి అంతర్జాతీయ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించబడింది. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం టీస్(ది ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ స్కిల్ సమ్మిట్) 2025లో ప్రదానం చేసారు. ఈ సమ్మిట్‌ను డిడాక్టిక్స్ ఇండియా నవంబర్ 18 నుంచి 20 వరకు యశోభూమి, ద్వారక, న్యూఢిల్లీలో ఆసియాలోనే అతి పెద్ద ఎడ్యుకేషన్ స్కిల్ లీడర్స్ సమ్మేళనం నిర్వహించింది. ప్రాథమిక విద్య రంగంలో నాయుడు అసాధారణ సేవలు, ఆయన వినూత్నమైన ఎడ్యూ-ఈజీ బోధనా విధానం, చిన్నారులకు ఆనందభరితమైన, ఒత్తిడిలేని, పునాది బలమైన విద్య అందించాలనే జీవితపరమైన అంకితభావం ఈ పురస్కారానికి కారణమయ్యాయి. ఈ కార్యక్రమంలో భారతీయ శిక్ష బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్ పి సింగ్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ అధ్యక్షులు కులభూషణ్, డొమినిక్ సావేజ్ , పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అకౌంట్లలోకి గూగుల్ పరిహారం

భూములిచ్చిన రైతులను ప్రలోభపెట్టే దళారులపై గంటా సీరియస్

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం : తర్లువాడలోని గూగుల్ డేటా సెంటర్ కోసం సేకరించిన భూములకు ఎక్కువ ధర ఇస్తానని రైతులను తప్పుదోవ పట్టిస్తున్న దళారుల విషయంలో ప్రభుత్వం సీరియస్ గా ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. గురువారం సర్క్యూట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తో కలిసి రైతులతో ఆయన సమావేశమయ్యారు. రైతుల అభ్యర్థన మేరకు ఎకరాకు నిర్ణయించిన రూ.17 లక్షల ధరను ప్రభుత్వం రూ.20 లక్షలకు పెంచిందని.. అదే సమయంలో ఎకరానికి 20 సెంట్లు చొప్పున తర్లువాడ పరిసరాల్లో భూమి కూడా ఇస్తామని ప్రభుత్వం జీఓ ఇచ్చిందన్నారు. రికార్డుల్లో లేని ఆక్రమణదారులకు ఎకరానికి రూ.8.5 లక్షల చొప్పున నిర్ణయించిన ధరను రూ.10 లక్షలు చేశారని తెలిపారు. శనివారం నుంచి పరిహారాన్ని నేరుగా రైతుల అకౌంట్లలోకి జమ చేయనున్నట్టు ప్రకటించారు. రైతులు మాట్లాడుతూ కొందరు దళారులు తమ వద్దకు వచ్చి రెండు ఎకరాలకు 55 సెంట్లు అభివృద్ధి చేసిన భూమి సహా రూ. 1.15 కోట్ల నగదు కూడా ఇస్తామని రెండు, మూడు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి అంగీకరించే రైతులకు ఒక్క రోజులోనే 50 శాతం సొమ్మును అకౌంట్లలో జమ చేస్తామని నమ్మబలుకుతున్నారని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి కొందరు రైతులను వెంట తిప్పుకుంటున్నారని, ఒక పక్క ప్రభుత్వం భూమి సేకరించగా.. అదే భూమిని అమ్మాలని ఒత్తిడి తెస్తున్న ఆ దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో తమకు తెలీకుండా తమ పేర్లతో కోర్టులో కేసులు వేశారని కూడా రైతులు గుర్తు చేశారు. ఈ ఉదంతంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్డీఓ సంగీత్ మాధుర్ చెప్పగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆ దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆనందపురం సీఐ వాసు నాయుడిని గంటా ఆదేశించారు. పరిహారంతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం ఇస్తామన్న 3 సెంట్ల ప్రభుత్వ స్థల విస్తీర్ణాన్ని 5 సెంట్లకు పెంచాలని.. గతంలో స్కిల్ డెవలప్మెంట్ భవనానికి, స్కూల్ కు భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆమోదయోగ్యమైన రైతుల కోరికలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని గంటా హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, ఎమ్మార్వో శ్రీనిబాబు, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, మాజీ సర్పంచ్ లు మజ్జి వెంకట్రావు, బాలి అయ్యప్ప, తాట్రాజు అప్పారావు, బంకు రాజు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ చేసిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం : నగర పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికుల కృషి వెలకట్టలేమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 8వ జోన్ (పెందుర్తి) 96 వార్డు కార్యాలయంలో జీవీఎంసీ పొరుగు సేవల పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ ను అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సేవలు వెలకట్టలేమని వారు నిర్వహించే విధులు వలన నగరం ఎంతో పరిశుభ్ర పడుతుందని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. 96వ వార్డులోని విధులు నిర్వహిస్తున్న 68 మంది పొరుగు సేవల పారిశుద్ధ్య కార్మికులైన 30 మంది పురుషులకు 2 జతల యూనిఫామ్,3 తువాళ్లు 38 మంది మహిళల కార్మికులకు 3 చీరలు 3జాకెట్లు 3 తువ్వాలను అందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా వారికి ఇప్పటికే అవసరమయ్యే పనిముట్లు, గ్లౌజులు, పారలు, చీపుర్లు మొదలైనవి అందించడం జరిగిందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వి ఎస్ నాయుడు పారిశుద్ధ్య కార్మికులు పలువురు తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ప్రత్యేక పూజలకు దర్శనవేళలు

విశాలాంధ్ర – వన్ టౌన్ : కనకమహాలక్ష్మి అమ్మవారు మార్గశిర మాసోత్సవములు సందర్భంగా 21/11/25 నుండి 19/12/25 వరకు ప్రత్యేక పూజల దర్శనం వేళలు నిర్ణయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దర్శనం వేళలు 27/11/25.ఉదయం 2.30. నుండి. 11.30 వరకు 4/12/25. సాయంకాలం 7. గం నుండి రాత్రి 12:00 వరకు 11/12/25 దర్శనం నిలుపుదల సమయం ఉదయం 11.30 గం నుండి 12 గంటల వరకు అమ్మవారికి రాజయోగం సాయంకాలం 5:30 నుండి 7:00 వరకు పంచామృత అభిషేకం నివేదన పంచ హారతిలు 18/12/25 తేదీ న ఉదయం 2:30 నుండి 11:30 వరకు మధ్యాహ్నం 12 నుండి సాయంకాలం నాలుగు వరకు సాయంకాలం 6 నుండి రాత్రి 12:00 వరకు దర్శనాలు జరుగునని తెలిపారు. ఉదయం 11:30 నుంచి 12 వరకు అమ్మవారికి రాజ భోగం సాయంత్రం నాలుగు నుండి ఐదు వరకు సహస్ర ఘటాభిషేకం సాయంకాల వైద్యులు ఉన్న ఆరు గంటల వరకు పంచామృత అభిషేకం నివేదన పంచ హారతులు గురువారం మినహా దర్శనం వేళలు ఉదయం ఆరు నుండి 8 వరకు ఉదయం 9 నుండి 11:30 వరకు 12:45 నుండి 5:30 వరకు సాయంకాలం 7 నుండి రాత్రి 12:00 వరకు దర్శన వేళలు అమ్మవారి దర్శనాలు నిలుపు నిలుపు వెళ్ళనా ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు పంచామృత అభిషేకం బాల భోగం ఉదయం 8 నుండి 9 వరకు క్షీరాభిషేకం మెచ్చాను 11: 30 నుండి 12 .30 వరకు పంచామృత అభిషేకం రాజబాబు. మధ్యాహ్నం 12:30 నుంచి 12:45 వరకు సాయంకాలం 5:30 నుండి 7:00 వరకు పంచామృత అభిషేకం పంచ హారతలు జరిగినని,వాట్సాప్ ద్వారా దర్శన్ టోకెన్లు ఆన్లైన్ బుకింగ్ కూడా చేసుకోవచ్చు వాట్సాప్ నంబర్ 9552300009 వివరాలకు 2568645, 2566515. 2731250 ఈ నెంబర్ లకు చేయాలని తెలియజేసారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర – విశాఖ : వన్ టౌన్ లోని రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బహుమతుల ప్రధాన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్ రాజు, పౌర గ్రంథాలయ శాఖ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, గ్రంథాలయం పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ బసు పోతన, క్వీన్ మేరీ మేరీ స్కూల్ టీచర్ ఎస్. సంధ్యారాణి, జి.వి.ఫాతిమారాణి, ఎన్. విజయలక్ష్మి ఆర్ సి ఎం క్యాథలిక్ స్కూల్ టీచర్స్ ఎం. భానుమతి, ఏవీఎన్ హైస్కూల్ టీచర్ కె.కనకమహాలక్ష్మి హాజరయ్యారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్ రాజా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బాలల శాఖ గ్రంథాల అధికారి టి. పోలితల్లి తదితరులు పాల్గొన్నారు.